# చంద్రుడిని ఢీకొన్న గ్రహశకలం

**130 అణుబాంబుల కంటే తీవ్రమైన పేలుడు.. దక్షిణ భాగంలో 2 భారీ లోయల ఏర్పాటు**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: చంద్రుడి దక్షిణ భాగం (ఫార్ సైడ్)లో విస్తారమైన రెండు లోయలు ఉన్నట్టు లూనార్ అండ్ ప్లానెటరీ ఇన్‌స్టిట్యూట్ (ఎల్‌పీఐ) శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఎన్నో ఏండ్ల క్రితం ఓ గ్రహశకలం గంటకు దాదాపు 55 వేల కిలోమీటర్ల వేగంతో జాబిల్లి ఉపరితలాన్ని ఢీకొనడం వల్ల ఈ లోయలు ఏర్పడ్డాయని, ఆ భారీ పేలుడుతో వెలువడిన శక్తి ఒకేసారి 130 అణుబాంబులు పేలడం ద్వారా వెలువడే శక్తి కంటే అధికమైనదని ప్రకటించారు. గ్రహవ్యవస్థ కల్లోలంగా ఉన్న సమయంలో గ్రహశకలాలు, తోకచుక్కలు ఢీకొని భూమి, చంద్రుడు తిరిగి పైకి వస్తున్నప్పుడు ఈ లోయలు ఏర్పడ్డాయని, ఇవి అమెరికాలోని గ్రాండ్ కాన్యన్ అంత వెడల్పు, లోతు ఉన్నాయని తెలిపారు. వీటిలో 'వల్లిస్ ప్లాంక్' అనే లోయ 280 కి.మీ (174 మైళ్ల) పొడవు, 3.5 కి.మీ (2.2 మైళ్ల) లోతు, 'వల్లిస్ ష్రింగర్' అనే మరో లోయ 270 కి.మీ (168 మైళ్ల) పొడవు, 2.7 కి.మీ (1.7 మైళ్ల) లోతు ఉన్నట్టు తమ అధ్యయనంలో తేలిందని వివరించారు. ఈ అధ్యయన వివరాలు 'జర్నల్ నేచర్ కమ్యూనికేషన్స్'లో ప్రచురితమయ్యాయి. గతంలో ఓ గ్రహశకలం లేదా తోకచుక్క చంద్రుడి దక్షిణ ధృవంలో ఉన్న మాలాపెర్ట్, మౌటన్ పర్వత శిఖరాల మీదుగా దూసుకొచ్చి జాబిల్లిని ఢీకొన్నదని, దీంతో ఎగసిపడిన శిథిలాలు గంటకు దాదాపు 3,600 కి.మీ (2,237 మైళ్ల) వేగంతో చంద్రుడి ఉపరితలంపై పడటంతో ఈ లోయలు ఏర్పడ్డాయని ఈ అధ్యయన పత్రం ప్రధాన రచయిత డేవిడ్ క్రింగ్ పేర్కొన్నారు. అమెరికాలో గ్రాండ్ కాన్యన్ ఏర్పడేందుకు మిలియన్ల సంవత్సరాలు పట్టినప్పటికీ చంద్రుడిపై ఈ రెండు లోయలు 10 నిమిషాల్లోపే ఏర్పడ్డాయని స్పష్టం చేశారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా'కు చెందిన రోబోటిక్ లూనార్ రికనైసెన్స్ ఆర్బిటర్ స్పేస్‌క్రాఫ్ట్ సేకరించిన సమాచారాన్ని ఉపయోగించుకుని ఈ లోయలను గుర్తించినట్టు తెలిపారు.

## 'యూజీసీ డ్రాఫ్ట్ రూల్స్‌ను ఉపసంహరించాలి'

న్యూఢిల్లీ: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ముసాయిదా నిబంధనలను ఉపసంహరించాలని ప్రతిపక్షాల పాలనలోని ఆరు రాష్ట్రాలు డిమాండ్ చేశాయి. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)కి అనుగుణంగా ఈ నిబంధనలను సవరించినట్లు చేస్తున్న వాదనలో పస లేదని కాంగ్రెస్ బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. కర్ణాటక ఉన్నత విద్యా శాఖ మంత్రి ఎంసీ సుధాకర్ నేతృత్వంలో కర్ణాటక, తెలంగాణ, కేరళ, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల ఉన్నత విద్యా శాఖ మంత్రులు, వారి ప్రతినిధుల సమావేశం బెంగళూరులో జరిగిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరామ్ రమేశ్ చెప్పారు. యూజీసీ డ్రాఫ్ట్ రెగ్యులేషన్స్, 2025ను వ్యతిరేకిస్తూ ఓ తీర్మానాన్ని ఆమోదించారని తెలిపారు. సమాఖ్య వ్యవస్థ రాజ్యాంగ సిద్ధాంతాలను ఉల్లంఘించరాదని చెప్పారు. ముఖ్యంగా ఉన్నత విద్య నాణ్యతపై విద్యా మంత్రిత్వ శాఖ దృష్టి పెట్టాలన్నారు.

## మొదటి భర్తతో విడాకులు పొందకున్నా..
# భరణానికి భార్య అర్హురాలే

**సుప్రీం కోర్టు తీర్పు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: తన మొదటి వివాహం చట్టబద్ధంగా రద్దు కానప్పటికీ భార్య తన రెండో భర్త నుంచి భరణం కోరే హక్కు కలిగి ఉంటుందని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. మొదటి భర్త నుంచి విడాకులు తీసుకోనప్పటికీ, అతని నుంచి వేరుగా ఉంటూ రెండో వివాహం చేసుకున్న భర్త నుంచి సెక్షన్ 125 క్రిమినల్ ప్రొసీజర్ ప్రకారం పరిహారాన్ని పొందవచ్చునని జస్టిస్ బీవీ నాగరత్న, సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం తెలిపింది. మొదటి భర్తతో విడాకులు పొందనందున ఆమెకు రెండో భర్త నుంచి భరణం కోరే హక్కు ఉండదంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై కోర్టు బాధితురాలికి అనుకూలంగా తీర్పు చెప్పింది. 125 క్రిమినల్ ప్రొసీజర్ ప్రకారం భరణ హక్కు భార్య పొందే ప్రయోజనం కాదని భర్త వహించాల్సిన నైతికపరమైన, చట్టపరమైన విధి అని గుర్తుంచుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. కేసు వివరాల్లోకి వెళితే.. ఒక మహిళకు పెండ్లయ్యి ఒక పిల్లాడు సంతానం. అయితే భర్తతో విభేదాల కారణంగా ఆమె అతడితో విడిపోయి, మరో వ్యక్తిని రెండో పెండ్లి చేసుకుంది.

## ఒంటరిగా ఎవరెస్ట్ అధిరోహించడంపై నిషేధం

**నేపాల్ ప్రభుత్వం నిర్ణయం**

కాఠ్మాండూ: ఎవరెస్ట్ పర్వతంతో పాటు 8,000 మీటర్ల కన్నా ఎక్కువ ఎత్తయిన పర్వతాలపైకి ఒంటరిగా వెళ్లడాన్ని నేపాల్ ప్రభుత్వం నిషేధించింది. మంగళవారం నుంచి అమల్లోకి వచ్చిన పర్వతారోహణ నిబంధనల ప్రకారం, ప్రతి ఇద్దరు పర్వతారోహకులకు తప్పనిసరిగా ఒక మౌంటెయిన్ గైడ్ ఉండాలి. ఇతర పర్వతాలను అధిరోహించడానికి ఒక బృందానికి కనీసం ఒక మౌంటెయిన్ గైడ్ తప్పనిసరి. ఎవరెస్ట్ శిఖరం ఎత్తు 8,849 మీటర్లు.

## ఆఫీసులో చాట్‌జీపీటీ, డీప్‌సీక్ వాడొద్దు

**కేంద్ర ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు ఆఫీస్ కంప్యూటర్లు, ఇతర పరికరాల్లో చాట్‌జీపీటీ, డీప్‌సీక్ వంటి కృత్రిమమేధ(ఏఐ) యాప్‌లను వాడరాదని, డౌన్‌లోడ్ చేయరాదని ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ పత్రాలు, డాటా గోప్యత గల్లంతయ్యే ప్రమాదముందని కేంద్ర ఆర్థిక శాఖ హెచ్చరించింది. ఈ మేరకు జనవరి 29న కేంద్ర ప్రభుత్వం సంబంధిత శాఖ అధికారులందరికీ ఒక నోట్ జారీచేసినట్టు తెలిసింది. ప్రభుత్వ ఆఫీసు పరికరాల్లో ఏఐ టూల్స్ లేదా ఏఐ యాప్స్ వాడరాదని ఆ నోట్‌లో కేంద్రం స్పష్టం చేసింది.

## మహా కుంభ్‌లో మోదీ పవిత్ర స్నానం



ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 5: ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానం ఆచరించారు. మహా కుంభమేళాను సందర్శించడం తన సుకృతమని, భక్తిభావంతో తన హృదయం నిండిపోయిందని ప్రధాని ఈ సందర్భంగా అన్నారు. పవిత్ర స్నానం సందర్భంగా ప్రధాని రుద్రాక్ష మాలను ధరించారు. చిక్కని నారింజ రంగు జెర్సీ, నీలి రంగు ప్యాంటు ధరించిన మోదీ సూర్య భగవానుడికి, గంగా మాతకు ప్రార్థనలు చేశారు. ప్రజలకు శాంతి, జ్ఞానం, మంచి ఆరోగ్యం,సామరస్యాన్ని గంగా మాత ప్రసాదించాలని ప్రార్థించినట్టు ఎక్స్ వేదికగా మోదీ తెలిపారు. దాదాపు గంటన్నర పాటు మహాకుంభ్‌లో గడిపారు. ప్రధాని వెంట ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉన్నారు.

## ట్రాఫిక్ ఉల్లంఘనలకు రూ.1.61 లక్షల జరిమానా

బెంగళూరు: గేర్‌లెస్ స్కూటర్ నడుపుతూ 311 ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన బెంగళూరు వ్యక్తి భారీ జరిమానా చెల్లించారు. ట్రాఫిక్ పోలీసులు ఎక్స్ వేదికగా తెలిపిన వివరాల ప్రకారం, ఈ వ్యక్తిని ఈ నెల 3న గుర్తించి, గేర్‌లెస్ స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ మర్నాడు ఆయన రూ.1,61,500 ఫైన్ చెల్లించడంతో, ఆ స్కూటర్‌ను తిరిగి ఆయనకు ఇచ్చేశారు. ట్రాఫిక్ నిబంధనలను అనుసరించాలని గట్టిగా సూచించారు. ఈ జరిమానా రశీదులను ఒకదాని తర్వాత ఒకటి పేర్చినపుడు 20 మీటర్ల పొడవు ఉన్నాయి.

## విజయ్ దుర్గ్‌గా ఫోర్ట్ విలియం

కోల్‌కతా: వారసత్వంగా కొనసాగుతున్న వలస పాలకుల పేర్లను తొలగించే చర్యలలో భాగంగా కోల్‌కతాలోని ఈస్టర్న్ ఆర్మీ కమాండ్ ప్రధాన కార్యాలయం ఫోర్ట్ విలియం పేరును విజయ్ దుర్గ్‌గా మార్చుతున్నట్టు సైన్యం బుధవారం ప్రకటించింది. కోల్‌కతా నడిబొడ్డున ఉన్న ఈ క్యాంపస్ లోపల గల వివిధ చారిత్రక భవనాల పేర్లనూ మార్చింది.

## బాకీ కంటే అనేక రెట్లు ఎక్కువ
# వసూలు చేశాయి!

- కర్ణాటక హైకోర్టును ఆశ్రయించిన విజయ్ మాల్యా
- 13లోగా జవాబివ్వాలని బ్యాంకులకు కోర్టు నోటీసులు

బెంగళూరు: విదేశాలకు పరారైన వ్యాపారవేత్త విజయ్ మాల్యా కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. తాను బాకీపడినదాని కన్నా ఎక్కువ సొమ్మును బ్యాంకులు తన నుంచి రాబట్టుకున్నాయని ఆరోపించారు. తాను బ్యాంకులకు రూ.6,200 కోట్లు బాకీ ఉన్నానని, తన నుంచి రూ.10,200 కోట్లు రాబట్టుకున్నాయని తెలిపారు. తనతోపాటు, యునైటెడ్ బ్రీవరీస్ హోల్డింగ్స్ లిమిటెడ్ (యూబీహెచ్‌ఎల్, ప్రస్తుతం లిక్విడేషన్‌లో ఉంది), ఇతర సర్టిఫికెట్ రుణగ్రస్థుల నుంచి రాబట్టుకున్న సొమ్ము వివరాలను తెలియజేయాలని కోరారు. తన నుంచి రూ.14,000 కోట్లు రాబట్టినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటుకు తెలిపారని చెప్పారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ, బ్యాంకులకు నోటీసు జారీ చేసింది. ఈ నెల 13 నాటికి సమాధానం చెప్పాలని ఆదేశించింది. మాల్యా ఈ పిటిషన్‌ను ఈ నెల 3న దాఖలు చేశారు.














